సాక్షి మెదక్

శనివారం । 17 । జూన్ । 2023



కీచక పీఈటీ

సిర్గాపూర్ మండల (నారాయణఖేడ్) కేంద్రంలో ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ సంగ్రామ్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు.

8లో



నీళ్లు సరే.. కాల్వల మరమ్మతులేవి?

గౌరవెల్లి ప్రాజెక్టులోకి గోదావరి జలాలు తరలించేందుకు అధికారులు పనులు వేగిరం చేశారు.

8లో

22న జెడ్పీ సమావేశం

మెదక్ కలెక్టరేట్: ఈనెల 22న జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఉంటుందని జెడ్పీ సీఈఓ వెంకట శైలేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నందున అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి రావాలన్నారు.

9లో

న్యూస్‌రీల్

రాష్ట్రం రూ.ఐదులక్షల కోట్ల అప్పులపాలు



రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ నేతలు సంజీవరెడ్డి తదితరులు

పెద్దశంకరంపేట(మెదక్): తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.ఐదు లక్షల కోట్ల అప్పులపాలు జేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట– నార్సింగ్ నుంచి మెదక్ వెళ్లే రహదారిని పూర్తి చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాడ్చెట్‌పల్లి వద్ద రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్లుగా ఈ రహదారి అసంపూర్తిగా ఉండడంతో టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాల ప్రజలు జిల్లాకేంద్రానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రూ.24 కోట్లు వెచ్చించినా నల్లవాగు అభివృద్ధి జరగడం లేదన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు నారాగౌడ్, దాచ సంగమేశ్వర్, విఠల్, అంజిరెడ్డి, రాంచందర్, రాజునాయక్, కాయిత సాయిలు, సంగయ్య, సాయిరెడ్డి, రోమాల సాయిలు, గోవింద్‌రావు, కుమార్, హరిప్రసాద్ రెడ్డి, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల పరిధిలోని తునికిలోగల డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థ, వ్యవసాయ కళాశాల డైరెక్టర్ అర్జునరావు శుక్రవారం తెలిపారు. పాలిసెట్–2023 అర్హత సాధించిన విద్యార్థులు ఇందుకు అర్హులన్నారు. రామానాయుడు విజ్ఞానజ్యోతి వ్యవసాయ కళాశాలలో అన్ని రకాల వసతులతో విద్యార్థులను నాణ్యమైన వ్యవసాయ విద్య అందిస్తున్నట్టు ఆయన చెప్పారు. బాలురు, బాలికలకు ప్రత్యేక హాస్టల్‌వసతి ఉందన్నారు. ఈనెల 24వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి 26 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

80 గిరిజన పంచాయతీల్లో నేడు గ్రామసభలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని 80 గిరిజన గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆయా గ్రామాలలో గిరిజన సంప్రదాయ దుస్తులతో ఊరేగింపులో పాల్గొని పూజాకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామసభలో ఆరురకాల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. 57 గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకు శంకుస్థాపన ఏర్పాట్లు చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మెదక్ మండలంలోని మల్కాపూర్‌తండాలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మాసాయిపేట మండలం రామంతాపూర్‌తండాలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

బలవంతంగా సంతకాలు పెట్టించారు



మాట్లాడుతున్న నర్సమ్మ

మెదక్ కలెక్టరేట్: మోసపూరిత మాటలతో కార్మికులను మభ్యపెట్టి సంతకాలు చేయించి మధ్యాహ్న భోజనపథకాన్ని అక్షయపాత్రకు అప్పగించారని సీఐటీయూ జిల్లాకార్యదర్శి నర్సమ్మ మండిపడ్డారు. శుక్రవారం మెదక్‌లోని కేవల్ కిషన్‌భవన్‌లో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజనం ప్రారంభమై 20 సంవత్సరాలు పూర్తయినా కార్మికులకు సరైన వేతనాలు, సకాలంలో బిల్లులు చెల్లించడం లేదన్నారు. పిల్లలకు అప్పటికప్పుడు వేడివేడి భోజనం వండివడ్డిస్తున్న కార్మికుల పొట్టకొట్టడం దారుణమన్నారు. అక్షయపాత్ర ద్వారా పౌష్టికాహారం పేరుతో పాచిపోయిన అన్నం, నీళ్లచారుతో భోజనం పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో పాఠశాలలో కార్మికులచే వంట చేయించి భోజనం పెట్టించాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిద్ధమవుతామన్నారు.

ధాన్యం డబ్బులు మంజూరు

మెదక్ కలెక్టరేట్: ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తాజాగా రూ.187 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అదనపు కలెక్టర్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తికాగా, 28,757 మంది రైతులకు రూ.231.43 కోట్లు వారి ఖాతాలో జమచేశామన్నారు. ఇప్పుడు వచ్చిన రూ.187 కోట్లు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేస్తామన్నారు.

కష్టమే..

- సీఎంఆర్‌లో రైస్‌మిల్లుల ఇష్టారాజ్యం
- మే నెలాఖరు డెడ్‌లైన్ ఉత్తిమాటే



ఓ రైస్‌మిల్లులో నిల్వ ఉన్న ధాన్యం గుట్టలు

మెదక్‌జోన్: సీఎంఆర్ విషయంలో కొన్ని రైస్ మిల్లులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. 2022కు సంబంధించి అప్పగించాల్సిన బియ్యంపై మే నెలాఖరు వరకు ఆయా రైస్‌మిల్లులకు డెడ్‌లైన్ విధించినా స్పందన లేదు. గతేడాది వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 43 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పౌరసరఫరాల శాఖకు చేరాల్సి ఉంది.

- 2022 యాసంగిలో జిల్లావ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా, 2.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం సీఎంఆర్ (కస్టమ్స్ మిల్లింగ్ రైస్) కోసం జిల్లాలోని 135 రైస్ మిల్లులకు పంపించింది.
- దీనికి సంబంధించి మిల్లర్లు 1.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం పౌర సరఫరాల శాఖకు అప్పగించాలి. కాగా ఇప్పటివరకు 1.45 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే పౌరసరఫరాల శాఖకు అందించినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.
- 2022 వానాకాలానికి సంబంధించి 3.87 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించగా, అందుకు సంబంధించి 2.59 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్‌కు అప్పగించాలి. ఇందులోనూ ఇంకా 13 వేల మెట్రిక్‌టన్నుల బియ్యం పెండింగ్‌లో ఉంది.
- ఈ లెక్కన గతేడాదికి రెండు సీజన్లకు సంబంధించి ఇంకా 43 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉన్నా, మిల్లర్లు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కమిషనర్ ఆదేశించినా..?

పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ గత మే నెలలో మెదక్ వచ్చిన సందర్భంగా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నెలాఖరులోగా బియ్యాన్ని అప్పగించని మిల్లర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా సదరు మిల్లుల యాజమాన్యాల్లో ఏమాత్రం స్పందన లేదు.

'చౌక'గా కొనుగోలు చేస్తున్న మిల్లర్లు

ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పేద ప్రజలకు పంపిణీ చేసే బియ్యంలో 70శాతం వరకు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ బియ్యాన్ని గ్రామాల్లో కొందరు కిలోకు రూ.10 చొప్పున కొనుగోలు చేసి, మిల్లర్లకు రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని కొందరు మిల్లర్లు సీఎంఆర్ స్థానంలో అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

ఈ యాసంగిలో 3.12 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో ఈ యాసంగిలో 2.60 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. కొనుగోలు కేంద్రాల ద్వారా 3.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. గతేడాదికి సంబంధించిన ధాన్యం ఇంకా మిల్లులోనే నిల్వగా ఉండగా, ఈ యాసంగి ధాన్యాన్ని నిల్వ చేయడం కొంచెం ఇబ్బందికరంగానే మారింది. చాలా మిల్లుల్లో ఆరుబయటనే ధాన్యాన్ని రాశులుగా నిల్వ చేసి ఉంచారు.

కానరాని తనిఖీలు

- మిల్లుల్లో సీఎంఆర్ బియ్యం నిల్వలపై తనిఖీలు కొరవడ్డాయి. బస్తాల్లో ఉన్న ధాన్యం ఎక్కడిది. అది సీఎంఆర్ కిందకే వస్తుందా...మరాడించారా, పౌర సరఫరాలశాఖకు అప్పగించేందుకు ఆలస్యం ఎందుకు అవుతుందనే వివరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు తనిఖీలు చేయాలి.
- ఈ తనిఖీలు ఎక్కడా జరగటం లేదు. ఉన్నతాధికారులు పట్టించుకోవటం లేదు. దీంతో మిల్లర్ల ఇష్టారాజ్యం కొనసాగుతోంది.

చర్యలు తీసుకుంటాం



జిల్లాలో 2022 సంవత్సరానికి సంబంధించి 60 మిల్లుల నుంచి 43 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పౌరసరఫరాల శాఖకు రావాల్సి ఉంది. మే నెలాఖరులోగా బియ్యం అందజేయాలని చెప్పాం. బియ్యం పంపని మిల్లులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాస్, మెదక్ డీఎస్ఓ

ఉత్తమ సేవలకు ప్రశంస



నర్సాపూర్‌లో జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తున్న మురళీయాదవ్ తదితరులు

నర్సాపూర్: పట్టణ ప్రగతి కార్యక్రమంలో నర్సాపూర్‌లో పలు కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ జాతీయజెండా ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందచేశారు. పారిశుధ్య సిబ్బందికి కిట్స్ అందచేశారు. ఈ చైర్మన్ మురళీయాదవ్, కమిషనర్ వెంకట్‌గోపాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్ కౌన్సిలర్లు రాంచందర్, రాజేందర్, యాదగిరి, సీడీపీఓ హేమభార్గవి తదితరులు పాల్గొన్నారు.



ఖాజీపల్లిలో ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఇంటింటి సర్వే సకాలంలో పూర్తిచేయాలి

మెదక్ రూరల్: ఇంటింటి సర్వే సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. శుక్రవారం మండలపరిధిలోని ఖాజిపల్లి గ్రామాన్ని సందర్శించి, ఆరు ఓట్ల కంటే ఎక్కువగా ఉన్న కిషన్‌రావు ఇంటికి తహసీల్దార్ శ్రీనివాస్, బూత్‌స్థాయి అధికారులతో కలిసి వెళ్లి ఓటరు జాబితా ప్రకారం ఓటర్లు అందరూ ఒకే ఇంట్లో ఉన్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటి సర్వే ప్రక్రియ కట్టుదిట్టంగా సకాలంలో పూర్తి చేయాలని బూత్‌స్థాయి అధికారులకు సూచించారు. ఓటరు జాబితా నుంచి తొలగించిన పేర్లు పున:పరిశీలించాలని, మరణ ధ్రువీకరణపత్రం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహంకాళి స్వప్నసిద్దుయాదవ్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

కొండాపూర్(సంగారెడ్డి): ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. పదో తరగతికి సంబంధించి సంగారెడ్డిలో 1971 మంది అభ్యాసకులకుగాను 1504 మంది, మెదక్ జిల్లాలో 436 మందికి 308 మంది, సిద్దిపేట జిల్లాలో 709 మందికి 373 మంది ఉత్తీర్ణత సాధించారు. సంగారెడ్డి 76.31, మెదక్ 70.64, సిద్దిపేట 52.61 ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్‌కు సంబంధించి సంగారెడ్డిలో 3433 మంది అభ్యాసకులకుగాను 2261, మెదక్‌లో 950 మందికి 453 మంది, సిద్దిపేటలో 1205 మందికి 548 మంది అభ్యాసకులు ఉత్తీర్ణత సాధించారు. సంగారెడ్డిలో 65.86, మెదక్‌లో 47.68, సిద్దిపేటలో 48.46 ఉత్తీర్ణత శాతం నమోదైంది. మెమోలు 15 రోజులలో సంబంధిత అధ్యయన కేంద్రాలలో అందుబాటులో ఉంటాయన్నారు. మెమోలలో ఏమైనా తప్పులు ఉంటే వాటిని సవరించేందుకు ఈనెల 17వ తేదీ లోపు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీకి అందజేయాలన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి జూలై 7వ తేదీ వరకు రీకౌంటింగ్‌కు పదో తరగతిలో ఒక్కో సబ్జెక్టుకు రూ.350, ఇంటర్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.400 చెల్లించాలన్నారు. వెరిఫికేషన్ కోసం ఇంటర్, పదో తరగతిలో ఒక్కో సబ్జెక్టుకు రూ.1200 మీ సేవ కేంద్రంలో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామిని 8008403635 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీజేపీలో జోష్

ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రకార్యవర్గంలోకి పదిమంది.. పాత, కొత్త నేతలకు ప్రాధాన్యం



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : భారతీయ జనతాపార్టీలో పదవుల పంపకాలు ప్రారంభమయ్యాయి. వచ్చేఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పలువురు నేతలకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించారు. ఉమ్మడిజిల్లా నుంచి పదిమంది రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. సంగారెడ్డి జిల్లా నుంచి అడెల్లి రవీందర్, ఎడ్ల రమేష్, సి.గోదావరి అంజిరెడ్డి, దామోదర రాంచందర్, మెదక్ జిల్లా నుంచి మురళీయాదర్, కరణం పరణీత, తాళ్లపల్లి రాజశేఖర్, సిద్దిపేట జిల్లా నుంచి సొప్పదండి విద్యాసాగర్, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జె.సురేందర్‌రెడ్డిలకు అవకాశం దక్కింది.

ఎన్నికల వేళ...

దుబ్బాక సహా ఒకటిరెండు నియోజకవర్గాలల్లో మినహా మిగిలిన చోట్ల బీజేపీ నాయకత్వ సమస్యను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో పార్టీలో పనిచేస్తున్న వారికి పదవులు ఇవ్వడం ద్వారా నేతల్లో కొంత మేరకు ఉత్సాహం నింపినట్టు అవుతుందని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నేతలకు పదవులు ఇవ్వడం ఎంతో కొంత కలిసొచ్చే అవకాశాలున్నట్టు పార్టీ అంచనా.

పాత, కొత్త నేతలు..

పదవులు దక్కిన వారిలో కొత్తగా పార్టీలో చేరిన వారు కొందరు ఉండగా,సీనియర్ నాయకులకు సైతం పదవులు దక్కేలా రాష్ట్ర నాయకత్వం జాగ్రత్త తీసుకుంది. టీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మురళీయాదవ్ ఏడాది క్రితం బీజేపీలో చేరారు. దామోదర రాంచందర్, టీడీపీలో పనిచేసిన ఎడ్ల రమేష్ కూడా బీజేపీలో చేరారు. కరణం పరణీత రెండేళ్ల క్రితం బీజేపీలో చేరారు. ఇలా కొత్తగా పార్టీలో చేరిన వారికి పదవులు దక్కగా, మరోవైపు పార్టీ సీనియర్లకు కూడా అవకాశం కల్పించారు. సొప్పదండి విద్యాసాగర్‌రావు వంటి వారు చాలా ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్నారు. అన్ని సామాజికవర్గాలకు చోటు కల్పించేలా పదవులు ప్రకటించారని జిల్లా నేతలు పేర్కొంటున్నారు.

చేరికలు తక్కువే..

పలు నియోజకవర్గాల్లో బీజేపీలోకి చెప్పుకోదగిన చేరికలు లేవు. ఎన్నికలు దగ్గర పడుతున్నప్పటికీ బీఆర్ఎస్ నుంచి కానీ, ఇటు కాంగ్రెస్ పార్టీ నుంచి గానీ బీజేపీలో చేరిన వారు లేరు. మరోవైపు ఉన్న నేతలు కూడా తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో పార్టీ పదవుల పంపకాలతో కొంత మేరకైనా ఉత్సాహం నింపవచ్చని భావనలో ఆ పార్టీ ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

త్వరలో మరికొంతమందికి..

రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తాజాగా పది మందిని నియమించగా, మరికొంత మందికి కూడా పదవులు దక్కే అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో మరో ఎనిమిది మందికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఈ ప్రకటన ఉంటుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

పిచ్చి కుక్కదాడి.. ఏడుగురికి గాయాలు

నిజాంపేట(మెదక్): పిచ్చకుక్క దాడిలో ఏడుగురికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిచ్చికుక్క దాడి చేసి ఏడుగురిని గాయపరిచింది. వీరిని వెంటనే రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో సిద్దరాములు, మహేశ్వరికి గాయాలు ఎక్కువ కావడంతో హైదరాబాద్‌కు తరలించారు.

సీఎం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీజేపీ జాతీయకార్యదర్శి అరవింద్ మీనన్

రామాయంపేట(మెదక్): రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యపర్చాలని బీజేపీ జాతీయకార్యదర్శి, పార్టీ రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్ పిలుపునిచ్చారు. శుక్రవారం రామాయంపేటలో నిర్వహించిన జిల్లా పార్టీ సంయుక్త మోర్చాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 30వ తేదీవరకు నిర్వహించే సమ్మేళనాలను జయప్రదం చేయాలన్నారు. జూన్ 21నుంచి 30 వరకు ప్రతిఇంటి తలుపు తట్టాలని, యువతకు సీఎం కేసీఆర్ చేసిన మోసాల విషయమై యువమోర్చా ప్రచారం నిర్వహించాలన్నారు. మహిళా, కిసాన్‌మోర్చా, గిరిజన మోర్చా సభ్యులు జరుగుతున్న అన్యాయాలను ఆయా వర్గాలవారికి వివరించాలన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు నందు జనార్దన్‌రెడ్డి, రాజశేఖర్, కరణం పరిణీత, జిల్లా ప్రధానకార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, నల్లాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అకుంఠిత దీక్షతోనే అభివృద్ధి

పల్లెప్రగతి-పట్టణ ప్రగతిలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి





కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా తదితరులు. (ఇన్‌సెట్) హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

మెదక్ మున్సిపాలిటీ: గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు అకుంఠిత దీక్షతో పనిచేయడం వల్లే నేడు గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో పరిఢవిల్లుతున్నాయని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మాయాగార్డెన్‌లో ఏర్పాటు చేసిన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యకమంలో ఆమె మాట్లాడుతూ పల్లెలు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. నేడు పల్లెలలో గుణాత్మక మార్పులు వచ్చాయన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో డంప్‌యార్డులు, వైకుంఠధామాలు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాక్టర్, ట్రాలీ, డోజర్ వంటివి అందించి పరిశుభ్రతకు పెద్దపీట వేశామన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం దిశగా నేడు పల్లెలు స్వయంసమృద్ధి సాధించాయన్నారు. పట్టణాలలో పరిశుభ్రతలో భాగంగా చెత్త సేకరణ వాహనాలను సమకూర్చామన్నారు. టీఎస్–బీపాస్ ద్వారా భవన నిర్మాణాలకు తక్షణ అనుమతులిస్తున్నామని, పేదవారికి ఒక రూపాయికే నల్లాకనెక్షన్ ఇస్తున్నామన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మేధావులతో చర్చించి పల్లె ప్రగతి–పట్టణప్రగతి కార్యక్రమాలకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. నేడు పల్లెలలో జవాబుదారీతనం, పోటీతత్వం పెరిగి ఒక గ్రామాన్ని మించి మరో గ్రామం అభివృద్ధి ముందు ఉంటుందన్నారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవనప్రమాణాలు పెరిగాయన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను సరళం చేస్తూ బాధ్యతలు ఫిక్స్ చేసినందున నేడు ప్రజాప్రతినిధులు, అధికారులలో జవాబుదారీతనం పెరిగి సమన్వయంతో, చక్కటి ప్రణాళికతో పనిచేస్తున్నారన్నారు. ఉత్తమ సేవలందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, సఫాయి కార్మికులను జ్ఞాపిక, ప్రశంసపత్రంతో అతిథులు సన్మానించారు. పల్లె ప్రగతి, పట్టణప్రగతిపై ప్రచురించిన కరపత్రాలను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు చంద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్లు చంద్రపాల్, రవీందర్‌గౌడ్, జితేందర్‌గౌడ్, మునిసిపల్ కమిషనర్లు జానకిరామ్‌సాగర్, మోహన్, గోపాల్, ఉమాదేవి, జెడ్పీ సీఈఓ శైలేష్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 181మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుతున్నాయి. శుక్రవారం జరిగిన పరీక్షలకు 181మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన మొదటి సంవత్సర పరీక్షలకు 2305 మందికి 2173మంది, మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు 954మందికి 905మంది విద్యార్థులు హాజరయ్యారు. మెదక్, పాపన్నపేటలోని పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్ పరీక్షల నోడల్ అధికారి సత్యనారాయణ సందర్శించారు.

తూప్రాన్ బల్దియాకు బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డు



మంత్రి కేటీఆర్ చేతులమీదుగా బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డు అందుకుంటున్న చైర్మన్ రవీందర్‌గౌడ్

తూప్రాన్: కొత్తగా ఏర్పడిన తూప్రాన్ మున్సిపాలిటీ అనతికాలంలోనే రాష్ట్రస్థాయిలో బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డు సొంతం చేసుకుంది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్, ఐటీ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, కమిషనర్ మోహన్‌లు బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చాయన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో రిటైర్డ్ ఎంపీడీఓ మృతి


ఆకుల అశోక్ (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని తారక రామ్‌నగర్ కాలనీలో నివసిస్తున్న మెదక్ రిటైర్డ్ ఎంపీడీఓ ఆకుల అశోక్ (64) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఏఎంసీ చైర్మన్ జగపతి, కౌన్సిలర్లు నర్మద, కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు శ్రీధర్‌యాదవ్, అనిల్‌కుమార్, ఉప్పల కిష్టయ్య, తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

హఠాత్తుగా కుప్పకూలి..


నర్సారెడ్డి(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): గుండెపోటుతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని జంగరాయి గ్రామానికి చెందిన రైతు నర్సారెడ్డి(65) శుక్రవారం గ్రామంలోకి వెళ్లి ఆసరా పింఛన్ తీసుకొని ఇంటికి వచ్చాడు. హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. నర్సారెడ్డి గతంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా పనిచేశారు.

కేసు నమోదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జ్యోతి థియేటర్‌లో ఆదిపురుష్ సినిమా ప్రదర్శన ఆలస్యం కావడంతో పలువురు ప్రేక్షకులు శుక్రవారం థియేటర్‌లోని కుర్చీలు, అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ప్రసాద్, హుస్సేన్‌లతో పాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. థియేటర్ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. 8 గేదెలు మృతి


గేదెల కళేబరాలు

నారాయణఖేడ్: గుర్తుతెలియని వాహనం ఢీకొని 8 పాడిగేదెలు మృతి చెందాయి. నారాయణఖేడ్ ఎస్ఐ ఏడుకొండలు, బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం రుద్రారం గ్రామానికి చెందిన పలువురు రైతులు వేసవికాలం కావడంతో మేత, తాగునీటి కొరత కారణంగా నిజాంసాగర్ ప్రాజెక్టు వెనుక గల పరీవాహక ప్రాంతమైన కల్హేర్, నిజాంపేట్ మండలాల శివార్లలో మేపేందుకు గేదెలను పంపారు. శుక్రవారం తెల్లవారుజామున ఐదుగురు రైతులకు సంబంధించిన 8 గేదెలు తప్పించుకొని నిజాంపేట్ మండల కేంద్రంలోని జాతీయరహదారిపైకి వచ్చాయి. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అవి రోడ్డుపై చెల్లాచెదురుగా పడి మృతిచెందాయి. మృతిచెందిన వాటి విలువ రూ.6లక్షల వరకు ఉంటుంది. బాధిత రైతుల్లో ఒకరైన కుర్మ రాములు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

కొనసాగిన ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు తుదిరాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువప్రతాల పరిశీలన మూడవ రోజు కొసాగింది. శుక్రవారం 750 మంది అభ్యర్థులకుగాను 668 హాజరైనట్లు ఎస్పీ రమణకుమార్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉష విశ్వనాథ్, పాలన విభాగం అధికారి కల్యాణి, డీపీఓ సిబ్బంది, ఆర్టీఓ సిబ్బంది, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

నీళ్లు సరే.. కాల్వల మరమ్మతులేవి?

- గౌరవెల్లి ప్రాజెక్టులోకి త్వరలో గోదావరి జలాలు
- చెరువులు నింపేందుకు అధికారుల ప్రణాళికలు


మోడల్ నీటి కాల్వ

హుస్నాబాద్‌రూరల్: గౌరవెల్లి ప్రాజెక్టులోకి గోదావరి జలాలు తరలించేందుకు అధికారులు పనులు వేగిరం చేశారు. హుస్నాబాద్ మండలంలో 93 చెరువులుండగా, అందులో 40 చెరువులను గోదావరి జలాలతో నింపేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. మరో 53 చెరువులకు నింపటానికి కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రాజెక్టులోకి గోదావరినీరు రాగానే అక్కడి నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా చెరువులు నింపుతారు. హుస్నాబాద్ డివిజన్ పరిధిలో అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్ మండలాల్లో 379 చెరువుల కింద 19,587 ఎకరాల ఆయకట్టు ఉంది. ఒకసారి చెరువులు నింపితేచాలు ఈ ప్రాంత రైతులకు సాగు నీటికి ఎటువంటి ఇబ్బందులు ఉండవు. అయితే పంటకాల్వలు ఆక్రమణకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువులు, కుంటలను కూడా కొందరు వదలలేదు.

- చెరువులు, కుంటలు మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్నప్పుడు మత్తళ్లు, తూములు, కాల్వలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించేవారు.
- ఇరిగేషన్ అంతా ఒకే గొడుకు కిందకు రావడంతో ప్రభుత్వం 40 చెరువులకు సబ్‌డివిజన్ ఏర్పాటు చేసి 20 చెరువులకు ఒక జేఈకి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది.
- అయితే ఇరిగేషన్ అధికారులకు గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులపై పట్టుదొరకపోవడం, చెరువు కాల్వలు ఎక్కడ ఉన్నాయో, ఉన్నవి కూడా గుర్తించలేకపోతున్నారు.
- కాల్వల మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే అధికారులకు పనులు చేయించే అవకాశం ఉంటుంది.
- చెరువు కాల్వలు ఆక్రమణకు గురవుతున్నాయని రైతులు చెప్పినా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవు.

కాల్వలను పట్టించుకోలేదు



చెరువు నిండితే మా తాత ఉన్నప్పుడు కాల్వపొంటి నీళ్లు వత్తె నాలుగు ఎకరాల పొలం పారేది. ఇప్పుడు ఏడేళ్ల కాలంపోతే చెరువు నీళ్ల పొలాలకు వచ్చుడే బందైన్నెయి. మిషన్‌కాకతీయ కింద కోటి నిధులు అత్తె మీదమీద పనులు చేసే కాంట్రాక్టర్ మిషన్లు పట్టుకపాయే. మిగిలిన నిధులతోని చెరువు తూము నుంచి రోడ్డు దగ్గరి మోరి దాక సిసితో కాల్వ పనులు చేస్తే గట్టిగా ఉంటది. కాల్వలను కూడిపినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– కోటేశ్వర్‌రావు, గాంధీనగర్

నిధులొస్తే పనులు చేయిస్తాం

చెరువు కాల్వల మరమ్మతులకు నిధులు లేవు. ఉపాధిహామీ కిందనే చెరువు కాల్వలకు మరమ్మతులు చేస్తున్నారు. గోదావరి జలాలను 40 చెరువుల్లో నింపటానికి కాల్వల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాము. ఆయకట్టు రైతులకు సాగు నీరు ఇవ్వడానికి కాల్వలు తవ్వడానికి ప్రత్యేక నిధులు వస్తే తక్షణం పనులు చేయిస్తాం.

– నందా, ఇరిగేషన్ డీఈ

సీజ్ చేసిన రైస్‌మిల్లుల క్రయవిక్రయాలపై నిషేధం

వెల్దుర్తి(తూప్రాన్): సీజ్ చేసిన రైసుమిల్లులను అమ్మడం, కొనడం నేరమేనని తహసీల్దార్ మాలతి అన్నాడు. ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించారని మాసాయిపేట శివారులోని శ్రీ చైతన్య పారా బాయిల్డ్ రైస్‌మిల్లును జిల్లా పౌరసరఫరా, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా గతేడాది ఫిబ్రవరిలో సీజ్ చేశారు. సంబంధిత యజమానులపై కూడా కేసులు నమోదు చేశారు. 2019–20 సంవత్సరానికి సంబంధించి మాసాయిపేటలోని శ్రీ చైతన్య పారా బాయిల్డ్ రైస్‌మిల్లు ప్రభుత్వానికి డిమాండ్ కంటే సుమారు 1300 మెట్రిక్ టన్నుల బియ్యం తక్కువగా సరఫరా చేయడం, 2021 మార్చి 31లోపు బియ్యం సరఫరా గడువు ముగిసినా సరఫరా చేయకపోవడం, డిసెంబర్ నెలలో బియ్యం సరఫరాకు అనుమతులు ఇచ్చినా పట్టించుకోలేదు. నిర్వాహకులు గతంలో ఇచ్చిన నోటీసులకు స్పందించకపోవడంతో అప్పట్లో మిల్లును సీజ్ చేసినట్లు తహసీల్దార్ మాలతి తెలిపారు. ఇదిలా ఉండగా సీజ్ చేసిన రైస్‌మిల్లును సంబంధిత యజమానులు విక్రయానికి పెట్టినట్లు అధికారుల దృష్టికి రావడంతో శుక్రవారం ఆ రైస్‌మిల్‌వద్ద క్రయవిక్రయాలు జరపకూడదని నోటీసుబోర్డు ఉంచారు. విక్రయించినా, కొనుగోలు చేసినా శిక్షార్హులు అవుతారన్నారు.

యాదాద్రి తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి


మాట్లాడుతున్న తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్

మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టాదార్ పాస్‌బుక్ ఇవ్వడానికి రైతును రూ.5 వేలు లంచం అడిగిన యాదాద్రి తహసీల్దార్ శోభన్‌బాబును ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుకోవాలని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల వద్ద రెవెన్యూ అధికారులు లంచం అడుగడం దురదృష్టకరమన్నారు. అవినీతి జరగకుండా ధరణి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా ఎదో రకంగా చేతివాటం చూపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మంజీర రైతు సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కీచక పీఈటీ

- విద్యార్థినులకు వేధింపులు.. దేహశుద్ధి చేసిన గ్రామస్తులు
- డీఈఓ విచారణ.. హెచ్‌ఎం, పీఈటీ సస్పెండ్


గ్రామస్తుల చేతితో దెబ్బలు తిన్న పీఈటీ సంగ్రామ్

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ సంగ్రామ్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న సంగ్రామ్ కొంత కాలంగా విద్యార్థినుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. విద్యార్థినిలు తల్లిదండ్రులు, గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తులంతా పాఠశాలకు చేరుకుని పీఈటీ సంగ్రామ్‌ను పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఆగ్రహంతో చెప్పులతో కొట్టారు. అనంతరం పోలీస్‌స్టేషన్ తరలించారు. పీఈటీ సంగ్రామ్‌ను పట్టుకున్న గ్రామస్తుల పట్ల పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డు ప్రతాప్‌సింగ్ మద్యం తాగి అసభ్యకరంగా వ్యవహరించాడు. దీంతో హోంగార్డును వెంబడించి చెప్పులతో కొట్టారు.

డీఈఓ సందర్శన..

సిర్గాపూర్ ఉన్నత పాఠశాలను డీఈఓ వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. పీఈటీ సంగ్రామ్ విద్యార్థినిలను వేధింపులకు గురిచేయడంతో కంగ్టీ సీఐ రాజశేఖర్‌తో కలిసి విచారణ జరిపారు. పాఠశాల హెచ్‌ఎం గురునాథ్, పీఈటీ సంగ్రామ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శరత్ ఉత్తర్వులు జారీ చేశారు. హోంగార్డు ప్రతాప్‌సింగ్‌పై చర్యలు తీసుకుంటామని సీఐ రాజశేఖర్ తెలిపారు. పీఈటీ సంగ్రామ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో...


గువ్వకుమార్(ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం పలుగుగడ్డ గ్రామానికి చెందిన గువ్వ కుమార్(33) వివాహం అదే గ్రామానికి చెందిన బాలమణితో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుమార్ వ్యవసాయం చేస్తుండగా, పంటనష్టంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ క్రమంలోనే అత్తగారి ఆస్తిలో వాటా విషయమై గొడవలు మొదలయ్యాయి. ఇదే విషయంలో గురువారం సాయంత్రం దంపతుల మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో కుమార్ ఇంటి నుంచిబయటకు వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు కుమార్ కోసం వెతుకుతుండగా పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో....

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్‌లోని కమ్మరివాడకు చెందిన రమేశ్(30) కమ్మరి పనిచేస్తున్నాడు. తరచు ఫిట్స్ వస్తున్నాయి. ఎన్నిసార్లు చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. ఈనెల 15న భార్య శ్రీలత తన కూతురిని తీసుకొని బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంట్లో రమేష్ ఒక్కడే ఉన్నాడు. శుక్రవారం ఉదయం ఇంటిపక్కన వారు శ్రీలతకు ఫోన్‌చేసి రమేశ్ ఇంట్లో ఉరివేసుకున్నాడు సమాచారం ఇచ్చాడు. ఆమె వెంటనే ఇంటికి వచ్చింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు నర్సాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎమ్మెల్యే


కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, జయశ్రీరెడ్డి దంపతులు

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని ముంబైలో రెండురోజులపాటు నిర్వహిస్తున్న శాసనభ్యుల జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తన సతీమణి జయశ్రీరెడ్డితో కలిసి వెళ్లారు. శుక్రవారం జరిగిన సమావేశంలో కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.

భారీ విండ్ టర్బయిన్ బ్లేడ్‌ల తరలింపు


వాహనంలో తరలిస్తున్న విండ్ టర్బయిన్ బ్లేడ్

జహీరాబాద్: జహీరాబాద్ మీదుగా శుక్రవారం భారీ విండ్ టర్బయిన్ రెక్కలు(బ్లేడ్) పలు వాహనాల్లో తరలించారు. ముంబై నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ ప్రాంతంలో నిర్మిస్తున్న పవన క్షేత్రాలకు వీటిని వినియోగించనున్నారు. ఒక్కో వాహనంలో 76 మీటర్ల పొడవు, సుమారు 12 టన్నుల బరువు కలిగి ఉన్న రెక్కలను టవర్లకు అమర్చేందుకు వీలుగా తీసుకెళ్లారు. విమానం రెక్కలతో పోలిఉన్న వీటిని 65వ జాతీయ రహదారి గుండా వెళ్లే ప్రయాణీకులు ఆసక్తిగా చూశారు.

సెక్యూరిటీ గార్డులకు సామాజిక భద్రత కల్పించాలి


కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే సెక్యూరిటీ గార్డులకు సామాజిక భద్రత లేదని జిల్లా కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో సెక్యూరిటీ గార్డుల సమస్యలపై కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఖేలో ఇండియా సెలక్షన్ షురూ

సిద్దిపేటజోన్: పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం ఖేలో ఇండియా సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు జిల్లా క్రీడా యువజన సంక్షేమ శాఖ అధికారి నాగేందర్ తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు 86మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో 12 నుంచి 16 ఏళ్ల లోపు బాలబాలికలు సైక్లింగ్‌పట్ల ఆసక్తి ఉన్నవారికి రన్నింగ్, సైక్లింగ్, ఎత్తు, బరువు, అంశాల్లో పోటీలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా 20మంది బాలికలు, 20మంది బాలురును ఎంపిక చేశారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు సీజ్

ఎంవీఐ రాజా మహ్మద్


వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ రాజా మహ్మద్

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించినట్లు పటాన్‌చెరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవిఐ) రాజా మహ్మద్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలో రవాణా శాఖ ఏ ఎంవీఐ లావణ్యతో కలసి స్కూల్ బస్సుల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు పరిధిలో మూడు విద్యాసంస్థలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ సరిగా లేని కారణంగా సీజ్ చేసినట్లు తెలిపారు.

తాళంవేసిన ఇంట్లో చోరీ


దొంగతనం జరిగింది ఈ బీరువాలోనే..

సిద్దిపేటకమాన్: తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. సిద్దిపేటలోని హనుమాన్‌నగర్‌కు చెందిన దాచరాజు సంతోష్‌కుమార్ గురువారం సాయంత్రం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ అల్వాల్‌లోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. ఇరుగు పొరుగు వారు ఇంట్లో దొంగతనం జరిగినట్టు గుర్తించి బాధితులకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం వారు ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉన్న రూ.64వేల నగదు, పది గ్రాముల రెండు ఉంగరాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. బాధితులు సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు అదృశ్యం

దంపతులు...


సంధ్య-సంతోష్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: దంపతులిద్దరూ అదృశ్యమయ్యారు. భానూర్–బీడీఎల్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం ..పటాన్‌చెరు మండలం నందిగామకు చెందిన సంధ్య వివాహం .. చేవెళ్ల మండలం కొరికుంట్ల గ్రామానికి సంతోష్‌తో జరిగింది. సంతోష్ సదాశివపేట ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వారంరోజుల క్రితం సంధ్య తల్లిగారింటికి వచ్చింది. రెండురోజుల క్రితం బంధువుల వద్ద శుభకార్యం ఉండటంతో సంతోష్ అత్తగారి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో 15వ తేదీన ఉదయం డ్యూటీకి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం నాలుగుగంటలకు సంధ్య భర్తతో కలిసి బైక్‌పై వెళ్లింది. సాయంత్రం ఆరుగంటలకు లక్ష్మి తన కూతురు, అల్లుడుకు ఫోన్ చేయగా ఇద్దరి ఫోన్లు స్విచ్‌ఆఫ్ వచ్చాయి. దీంతో తెలిసినా వారికి ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో తన కూతురు, అల్లుడు అదృశ్యం అయ్యారంటూ లక్ష్మి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాటలు రాని మహిళ....


చొప్పరి స్వప్న (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం...అక్కన్నపేట మండల పరిధిలోని మంచినీళ్లబండ గ్రామానికి చెందిన మాటలు రాని చొప్పరి స్వప్న(25) ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు వేచిచూసినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు దగ్గరి బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికారు. అయినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఆమె తండ్రి చొప్పరి మల్లేశం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుడు అదృశ్యం


ఓంకాశ్ యాదవ్ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ భవన నిర్మాణ కార్మికుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓంకాశ్ యాదవ్ జీవనోపాధికి ఉస్మాన్‌నగర్‌కు మూడునెలల క్రితం వలస వచ్చాడు. స్థానికంగా ఓ భవన నిర్మాణ సంస్థలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తోటి కూలీలతో కలసి లేబర్ క్యాంపులో నివాసం ఉంటున్నాడు. అతని కుటుంబ సభ్యులు ఒడిశాలో ఉంటున్నారు. ఈ నెల 14వ తేదీ రాత్రి10గంటల సమయంలో ఇప్పుడే వస్తాను అని బయటకు వెళ్లిన ఓంకాశ్‌యాదవ్ తిరిగి రాలేదు.ఈ విషయం తెలుసుకున్న ఆయన అల్లుడు అదిత్య శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి ఫోన్ నుంచి అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేసుకొని...


మహేష్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తండ్రి అకౌంట్ నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకొని ఓ కొడుకు ఇంట్లో నుంచి పారిపోయాడు. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..వందన పురికాలనీకి చెందిన గోరింట్ల మహేష్ కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం తండ్రి సాంబశివరావు ఫోన్ నుంచి రూ.64వేలు డబ్బులు తన అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు. ఆ తర్వాత ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బైక్ తీసుకొని వెళ్లిపోయాడు. ఫోన్ చేసినా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద మహేష్ ఆచూకీ కోసం వెతికారు. లాభం లేకపోవడంతో శుక్రవారం సాయంత్రం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అస్థికలు మాయం


దహనం చేసిన చోట అస్థికలు బూడిద లేని దృశ్యం

నారాయణఖేడ్: అస్థికలు మాయమయ్యాయని కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్‌కు చెందిన పులకంటి వినయమణి (35) అనారోగ్యంతో ఐదు రోజుల క్రితం మృతి చెందింది. గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుకభాగంలోని శ్మశానవాటికలో దహనసంస్కారాలు చేశారు. శుక్రవారం పంచమ దిన కర్మకాండ నిర్వహించాల్సి ఉంది. అందుకు అస్థికలు సేకరించాల్సి ఉండగా, మృతురాలి భర్త పండరితోపాటు కుటుంబీకులు, బంధువులు దహనం చేసిన చోటకు వెళ్లారు. అయితే అక్కడ అస్థికలు, బూడిద కూడా లేకపోవడంతో అవాక్కయ్యారు. పరిసరాల్లో పాదముద్రలు అస్థికలు, బూడిద ఎత్తుకెళ్లడానికి గంప కూడా ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు వీటిని మాయం చేసిఉంటారని భావించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


నరేశ్(ఫైల్)

రామాయంపేట(మెదక్): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. నార్సింగి ఎస్ఐ నర్సింలు తెలిపిన వివరాల ప్రకారం..మండలపరిధిలోని సంకాపూర్‌కు చెందిన భూమల్ల నరేశ్(35)కు భార్య మంజులతోపాటు రెండేళ్లలోపు పాప, బాబు ఉన్నారు. బతుకుదెరువుకోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. కొన్నేళ్లుగా అనార్యోగంతో బాధపడుతున్నాడు. ఈ నెల 11వ తేదీన వారిని అక్కడే ఉంచి స్వగ్రామానికి వచ్చాడు. గ్రామశివారులో క్రిమిసంహారకమందు తాగి సెల్‌లో వీడియో తీసుకొని స్టేటస్ పెట్టుకున్నాడు. స్టేటస్ చూసిన గ్రామస్తులు అతడిని నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చిన్నారులిద్దరూ తండ్రి కోసం విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. గ్రామ సర్పంచ్ సుజాతశ్రీనివాస్ అంత్యక్రియల నిమిత్తం రూ. ఐదు వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


టిప్పర్ చక్రాల కింద బైక్

గజ్వేల్‌రూరల్: టిప్పర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్‌లోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని వేములఘట్‌కు చెందిన ఇరుకోటి ప్రభాకర్ శుక్రవారం తన బైక్‌పై రోడ్డు నుంచి వేములఘట్ కాలనీవైపు వస్తుండగా, పక్కనుంచి వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో ప్రభాకర్ తలకు తీవ్రగాయాలుకాగా, కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.